# తెలంగాణ వార్ రూమ్ నుంచి ఢిల్లీ జాతీయ వార్ రూమ్ వరకు...

### దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ - జాతీయ కులగణన ఉద్యమానికి


### 100 రోజుల క్యాంపెయిన్ రూపకల్పనలో రుద్ర సంతోష్ కుమార్‌కు కీలక బాధ్యత

### తెలంగాణలో కులగణనను బూత్ స్థాయికి తీసుకెళ్లిన అనుభవానికి జాతీయ స్థాయిలో గుర్తింపు

**హైదరాబాద్, సెప్టెంబర్20(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో కులగణన కార్యక్రమాన్ని క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లేందుకు వార్ రూమ్, కాల్ సెంటర్, డిజిటల్ మానిటరింగ్ వంటి వ్యవస్థలను సమన్వయం చేసిన రుద్ర సంతోష్ కుమార్‌కు ఇప్పుడు జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించబడ్డాయి. జాతీయ జనగణనలో కులగణన అంశంపై దేశవ్యాప్తంగా నిర్వహించనున్న 100 రోజుల క్యాంపెయిన్‌కు ఏఐసీసీ వార్ రూమ్ కోఆర్డినేటర్‌గా రుద్ర సంతోష్ కుమార్‌ను నియమించినట్లు ఏఐసీసీ వర్గాలు వెల్లడించాయి. ఏఐసీసీ నుంచి ఈ బాధ్యతలకు సంబంధించిన నియామకపత్రం జారీ అయినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.దేశవ్యాప్తంగా కులగణనపై అవగాహన కార్యక్రమాలు, రాష్ట్రాల వారీ కార్యాచరణ, శిక్షణ, సంస్థాగత సమన్వయం, డిజిటల్ మానిటరింగ్, వారపు పురోగతి నివేదికలు వంటి అంశాలను సమన్వయం చేసే విధంగా జాతీయ వార్ రూమ్ కార్యాచరణను రూపొందించనున్నారు.**తెలంగాణ అనుభవానికి జాతీయ స్థాయిలో ప్రాధాన్యత** తెలంగాణలో 202425లో నిర్వహించిన కులగణన ప్రక్రియ సందర్భంగా రుద్ర సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక వార్ రూమ్, కాల్ సెంటర్ వ్యవస్థను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి సమన్వయం చేపట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థ ద్వారా పార్టీ కార్యకర్తలు, మండల అధ్యక్షులు, బ్లాక్, గ్రామ, బూత్ స్థాయి ప్రతినిధులతో నిరంతర సమన్వయం నిర్వహించారు.సుమారు 45 రోజుల పాటు కొనసాగిన ఈ కార్యక్రమంలో రోజుకు 2,000 మందికి పైగా కార్యకర్తలు, సంస్థాగత ప్రతినిధులతో సంప్రదింపులు నిర్వహించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 100కు పైగా కుల సంఘాలతో, సుమారు 35,000 మంది బూత్ స్థాయి కార్యకర్తలతో సమన్వయం చేసినట్లు వెల్లడించాయి.కులగణనను కేవలం రాష్ట్ర స్థాయి కార్యక్రమంగా కాకుండా బూత్ స్థాయి వరకు సంస్థాగతంగా తీసుకెళ్లే విధంగా రూపొందించిన సమన్వయ వ్యవస్థ ఇప్పుడు జాతీయ స్థాయి క్యాంపెయిన్ రూపకల్పనలో అనుభవంగా ఉపయోగపడనుంది.**సెప్టెంబర్ 8న ఢిల్లీలో కీలక జాతీయ ఓబీసీ వర్క్‌షాప్** ఈ నేపథ్యంలో ఢిల్లీలోని ఏఐసీసీ ఇందిరా భవన్‌లో సెప్టెంబర్ 8న జరిగిన జాతీయ ఓబీసీ వర్క్‌షాప్ ప్రాధాన్యత సంతరించుకుంది.ఏఐసీసీ నేషనల్ కోఆర్డినేటర్ కొప్పుల రాజు అధ్యక్షతన జరిగిన ఈ వర్క్‌షాప్‌లో ఏఐసీసీ ఓబీసీ జాతీయ చైర్మన్ అనిల్ జైహింద్ యాదవ్, ఏఐసీసీ మైనారిటీ జాతీయ చైర్మన్ ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి, వివిధ రాష్ట్రాల ఓబీసీ, మైనారిటీ విభాగాల చైర్మన్లు, జాతీయ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.జాతీయ స్థాయిలో కులగణన అవసరం, రాష్ట్రాల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, సంస్థాగత సమన్వయం, క్షేత్రస్థాయి అవగాహన, మానిటరింగ్ వ్యవస్థ వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చ జరిగింది.**45 నిమిషాల సమగ్ర ప్రెజెంటేషన్** 100 రోజుల క్యాంపెయిన్‌లో భాగంగా 15 వారాల పాటు దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన కార్యాచరణ ప్రణాళికను రుద్ర సంతోష్ కుమార్ సమగ్రంగా ప్రెజెంట్ చేశారు.సుమారు 45 నిమిషాల పాటు సాగిన ప్రెజెంటేషన్‌లో రాష్ట్ర స్థాయి వార్ రూమ్‌ల ఏర్పాటు, మాస్టర్ ట్రైనర్ల ఎంపిక, జిల్లా స్థాయి శిక్షణ, మండల/గ్రామ స్థాయి విస్తరణ, డిజిటల్ మానిటరింగ్, వారపు పురోగతి నివేదికలు, రాష్ట్రాల మధ్య సమన్వయం వంటి అంశాలను వివరించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక సమన్వయ వ్యవస్థను ఏర్పాటు



చేసి, రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా, మండలం, గ్రామ స్థాయి వరకు కార్యక్రమాల పురోగతిని పర్యవేక్షించే విధానాన్ని ప్రతిపాదించినట్లు సమాచారం.**100 రోజులు 15 వారాలు దేశవ్యాప్తంగా సమన్వయం** 100 రోజుల క్యాంపెయిన్‌ను దశలవారీగా అమలు చేసే విధంగా కార్యాచరణ రూపొందించారు. రాష్ట్రాల వారీగా ఓరియంటేషన్, మాస్టర్ ట్రైనర్ల శిక్షణ, జిల్లా స్థాయి కార్యక్రమాలు, ఓబీసీ కమ్యూనిటీ అవుట్‌రీచ్, పౌర సమాజ సంస్థలతో సమన్వయం వంటి అంశాలను వివిధ దశల్లో చేపట్టేలా ప్రణాళిక రూపొందించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.రాష్ట్రాల నుంచి వారపు ఫీడ్‌బ్యాక్ సేకరించడం, ఎదురయ్యే సవాళ్లను గుర్తించడం, అవసరమైన మార్గదర్శకాలను అందించడం కోసం జాతీయ వార్ రూమ్‌ను కేంద్ర సమన్వయ వేదికగా ఉపయోగించనున్నారు.**క్షేత్రస్థాయి అనుభవం నుంచి జాతీయ




వ్యూహం వరకు** తెలంగాణలో కులగణన కార్యక్రమంలో వార్ రూమ్ నిర్వహణ, కాల్ సెంటర్ సమన్వయం, డిజిటల్ డేటా సేకరణ, బూత్ స్థాయి కార్యకర్తలతో అనుసంధానం, రోజువారీ మానిటరింగ్ వంటి అంశాల్లో పనిచేసిన అనుభవం రుద్ర సంతోష్ కుమార్‌కు ఉంది.అదే అనుభవాన్ని జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల సంస్థాగత నిర్మాణాలకు అనుగుణంగా వినియోగిస్తూ, 100 రోజుల క్యాంపెయిన్‌కు సమగ్ర సమన్వయ వ్యవస్థను రూపొందించడంపై దృష్టి సారించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.**తెలంగాణ నుంచి ఢిల్లీ వరకు విస్తరించిన బాధ్యత** తెలంగాణలో కులగణన కార్యక్రమాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లిన సంస్థాగత అనుభవం అనంతరం, అదే అంశంపై జాతీయ స్థాయిలో 100 రోజుల క్యాంపెయిన్ రూపకల్పన, వార్ రూమ్ సమన్వయం, రాష్ట్రాల మానిటరింగ్ బాధ్యతలు రుద్ర సంతోష్ కుమార్‌కు అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది. తెలంగాణలో బూత్ స్థాయి వరకు నిర్మించిన సమన్వయ అనుభవం ఇప్పుడు జాతీయ స్థాయి కార్యాచరణకు విస్తరించనుంది.

## చిన్న వర్షానికి నీట మునిగిన గాయత్రి నగర్ రోడ్ నెంబర్ 4

- పాలకులు మారిన ప్రజల వెతలు తీరడం లేదని స్థానికులు ఆగ్రహం
- సిసి రోడ్లు, సైడ్ డ్రైనేజీలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీవాసులు





**కరీంనగర్ సెప్టెంబర్20 (పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలోని 38వ డివిజన్ గాయత్రీ నగర్ రోడ్ నెంబర్ 4 ఆదివారం కురిసిన స్వల్పపాటి వర్షానికి జలమయమైంది కార్పొరేటర్లు,ల్ మారుతున్న, ప్రభుత్వాలు మారుతున్న, మున్సిపల్ కార్పొరేషన్ లో పాలకవర్గాలు మారుతున్న కానీ 38వ డివిజన్ వాసుల వెతలు మాత్రం తినడం లేదు సైడ్ డ్రైనేజీలు సిసి రోడ్లు లేక ముంపు బాధితులుగా మిగిలిపోతున్నారు ఇక్కడి ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు కరీంనగర్ లో ఏ మూలకు వెళ్లిన సిసి రోడ్లు దర్శనం ఇస్తాయి కానీ 38వ డివిజన్ గాయత్రీ నగర్ రోడ్ నెంబర్ 4 క్యాన్సర్ ఆసుపత్రి వెనుక భాగం 50 ఫీట్ల రోడ్డు ఉండడంతో ఎక్కువ నిధులు అవుతుండడంతో రోడ్డు నిర్మాణం చేయలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఈ డివిజన్ వాసులు ఇప్పటికైనా పాలకవర్గాలు ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పెద్దలు స్పందించి గాయత్రీ నగర్ రోడ్ నెంబర్ 4 లో 50 ఫీట్ల మెయిన్ రోడ్డు ను సబ్ రోడ్లను సిసి డ్రైనేజీలను త్వరితగతిన పూర్తి చేసి ఇక్కడి ప్రజలకు పశమనం కలిగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## యాదాద్రి భువనగిరి జిల్లాలో శేఖర్ సేనాపతికి ఉత్తమ సేవా పురస్కారం



**రాజన్న సిరిసిల్ల సెప్టెంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్):** ఈ రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా యువచైతన్య దీపం ఫౌండర్ శేఖర్ సేనాపతికి యువచైతన్య దీపం ఫౌండేషన్ ద్వారా అనాధ అభాగ్యులకు నిరుపేదలకు అన్నదానాలు, పేద పిల్లలకు నోట్ బుక్స్ ఇవ్వడమే కాకుండా జిల్లాలో లనిరుపేదలకు అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందని వారికి గత సంవత్సరం నుండి బ్లడ్ సేవా క్యాంపులు కూడా నిర్వహిస్తున్న వారి సేవలను గుర్తించి ఈరోజున యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు పట్టణం పిఎస్ ఫంక్షన్ హాల్ లో భారత్ రక్తదాన సేవ మిషన్ ద్వారా రక్తదాన ఉత్తమ సేవ పురస్కార్ అవార్డు తీసుకోవడం జరిగిందిలి ఈ సందర్భంలో శేఖర్ సేనాపతి మాట్లాడుతూ సమాజసేవ చేయాలని అందరికీ ఉంటుంది. కానీ ఎన్నో ఎదురు దెబ్బలు ఆటు పోట్లు విమర్శలు తట్టుకొని నిలబడగలిగే వారికే సమాజంలో పేరు కీర్తి పరీక్ష లభిస్తాయి. ఆ పేరును జీవితాంతం నిలబెట్టుకోవడంలోనే మన ఆత్మగౌరవం ఉంటుంది. ఇటువంటి సన్మానాలు సేవా ప్రయాణంలో సాధారణంగా భావిస్తూ యధావిధిగా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ సమాజానికి సేవలు అందించడమే సమాజ సేవకుడి లక్షణం అని ఈ సందర్భంగా పేర్కొనడం జరిగింది.

# ములుగులో విత్తన కంపెనీ చేతిలో ఆదివాసీ రైతులకు మొండిచేయి

### 12 క్వింటాళ్ల దిగుబడి, క్వింటాకు రూ.12 వేలంటూ నమ్మించి లక్షల్లో మోసం.

**ఏటూరు నాగారం, సెప్టెంబర్20 (పిసిడబ్ల్యూ న్యూస్):** అడవి బిడ్డల అమాయకత్వాన్ని పెట్టుబడిగా చేసుకుని ఓ ప్రైవేట్ విత్తన కంపెనీ లక్షల్లో మోసానికి పాల్పడింది. ఎకరానికి 12 క్వింటాళ్ల దిగుబడి, క్వింటాలుకు రూ.12 వేలు ఇస్తామంటూ ఆశపెట్టి, పంట చేతికొచ్చాక ముఖం చాటేసిన ఘటన ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలంలో వెలుగుచూసింది. ఈ ఘటన గత ఏడాది మే నెలలో జరగ్గా, బాధితులు న్యాయం కోసం ఏడాదిగా తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతో తాజాగా ఈ వ్యవహారం బయటకు వచ్చింది.**శివాపూర్ లోనే మోసానికి తెరలేపిన కంపెనీ.** ఏటూరు నాగారం మండలం శివాపూర్ గ్రామానికి చెందిన 10 మందికి పైగా ఆదివాసీ రైతులు ఈ మోసంలో బాధితులుగా మిగిలారు. US RH Agree Seeds కంపెనీ పేరుతో ఆర్గనైజర్ తోట రాజు, సబ్ ఆర్గనైజర్ మదారి సంపత్ గ్రామంలోకి వచ్చారు. రైతులతో సమావేశాలు నిర్వహించారు. తమ కంపెనీ విత్తనాలు వేస్తే అధిక దిగుబడి వస్తుందని, మార్కెట్లో లేని విధంగా క్వింటాకు రూ.12 వేల ధర చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారి మాటలు నమ్మిన రైతులు అప్పులు చేసి మరీ పంట సాగు చేశారు.**నమ్మించి నట్టేట ముంచారు.** రైతులు పంటను కళ్లల్లో పెట్టుకుని కాపాడుకుని చేతికి తెచ్చారు. కానీ కొనుగోలు సమయానికి కంపెనీ తీరు








పూర్తిగా మారిపోయింది. దిగుబడి తక్కువ వచ్చిందని, అనుకున్న నాణ్యత లేదని సాకులు చెబుతూ చెప్పిన ధర ఇవ్వకుండా మొండికేసింది. కొంతమంది రైతులకు అసలు డబ్బులే ఇవ్వకుండా తిప్పించుకుంటోంది. ఈ విషయంపై రైతులు ఆర్గనైజర్ తోట రాజును ప్రశ్నిస్తే, సబ్ ఆర్గనైజర్ మదారి సంపత్ దే తప్పు అని, మదారి సంపత్ ను అడిగితే తోట రాజే బాధ్యుడని చెప్పుకుంటూ ఇద్దరూ తప్పించుకుంటున్నారని బాధితులు చెబుతున్నారు.**మంత్రి సీతక్కను కలిసినా దక్కని న్యాయం:** తమకు జరిగిన అన్యాయంపై బాధిత రైతులు ఏకంగా జిల్లా మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. అయినా నెలలు గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, కంపెనీపై కేసు నమోదు చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో విసిగిపోయిన రైతులు తాజాగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు రావాల్సిన బకాయిలు ఇప్పించి, మోసానికి పాల్పడిన US RH Agree Seeds కంపెనీ నిర్వాహకులపై, ఆర్గనైజర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.గిరిజన ప్రాంతాల్లోని రైతులకు వ్యవసాయంపై సరైన అవగాహన లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని ప్రైవేట్ కంపెనీలు ఇలా మోసాలకు పాల్పడుతున్నాయని, వ్యవసాయ శాఖ అధికారులు ఇలాంటి కంపెనీలపై నిఘా పెట్టి, అమాయక రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

## వర్షపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి..

### 59వ డివిజన్‌లో పలు ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు..

### ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన మేయర్, డిప్యూటీ మేయర్..

**కరీంనగర్, సెప్టెంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలో శనివారం సాయంత్రం సుమారు గంటపాటు కురిసిన భారీ వర్షంతో 59వ డివిజన్ ముకరంపురలో వర్షపు నీటి పారుదల సమస్య తీవ్రంగా మారింది. భారీగా వర్షపు నీరు చేరడంతో డివిజన్‌లోని పలు ఇళ్లలోకి నీరు ప్రవేశించి నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో స్థానికులు సమస్యను ఎఐఎంఐఎం కార్పొరేటర్ మహ్మద్ మజీద్ హుస్సేన్ దృష్టికి తీసుకెళ్లారు.వెంటనే స్పందించిన కార్పొరేటర్ మజీద్ హుస్సేన్ మేయర్ కొలగని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు,



మాజీ మేయర్‌కు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. అనంతరం వారు ప్రభావిత ప్రాంతాలను సందర్శించి వర్షపు నీటి నిల్వలు, ఇళ్లలోకి చేరిన నీటిని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్య తీవ్రతను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మేయర్, డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ వర్షపు నీటి పారుదల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమస్య కేవలం 59వ డివిజన్‌కే పరిమితం కాకుండా కరీంనగర్ నగరంలోని పలు డివిజన్లను ప్రభావితం చేస్తోందని తెలిపారు. తాత్కాలిక చర్యలతో పాటు దీర్ఘకాలిక పరిష్కారం కోసం ప్రణాళిక రూపొందించి అవసరమైన పనులు చేపడతామని పేర్కొన్నారు.వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ మహ్మద్ మజీద్ హుస్సేన్ కోరారు. సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజల తరఫున పోరాడుతామని ఆయన తెలిపారు.

# కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో ఉద్యమకారుల చేరిక

**టీఆర్ఎస్ మల్లంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు పాలేపు శీను ఆధ్వర్యంలో కార్యక్రమం**

**మల్లంపల్లి మండల సాధన సమితి అధ్యక్షులు గోల్కొండ రాజు ఆధ్వర్యంలో పలువురు ఉద్యమకారులు పార్టీలో చేరిక**





**మల్లంపల్లి మండల ప్రతినిధి సెప్టెంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగులోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో టీఆర్ఎస్ మల్లంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు పాలేపు శీను ఆధ్వర్యంలో, కాకులమర్రి లక్ష్మణ్ బాబు సమక్షంలో మల్లంపల్లి మండల సాధన సమితి అధ్యక్షులు గోల్కొండ రాజు ఆధ్వర్యంలోని పలువురు ఉద్యమకారులు దీ=హా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాకులమర్రి లక్ష్మణ్ బాబు వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.మల్లంపల్లి మండల సాధన కోసం గతంలో ప్రజలతో కలిసి ఉద్యమించిన ఉద్యమకారులు, మండలం ఏర్పడిన అనంతరం మల్లంపల్లి అభివృద్ధి కోసం మరోసారి రాజకీయంగా ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.**మండల సాధన ఉద్యమం నుంచి అభివృద్ధి పోరాటం** మల్లంపల్లి మండల సాధన కోసం సంవత్సరాల తరబడి ప్రజలతో కలిసి పోరాటం చేసిన మండల సాధన సమితి అధ్యక్షులు గోల్కొండ రాజు మాట్లాడుతూ.. మండలం సాధించడం తమ ఉద్యమ ప్రస్థానంలో ఒక ముఖ్యమైన ఘట్టమని, అయితే మండలం ఏర్పడినంత మాత్రాన ప్రజల సమస్యలు పూర్తిగా పరిష్కారం కాలేదని అన్నారు.మల్లంపల్లికి అవసరమైన ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆసుపత్రి, 108 అంబులెన్స్, పోలీస్ స్టేషన్, బస్టాండ్, గ్రంథాలయం, విద్యా సదుపాయాలు, రహదారులు తదితర మౌలిక వసతుల కోసం ప్రజల తరపున నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.**డబ్బు పంపిణీ లేకుండా సుమారు 600 ఓట్లు** స్థానిక ఎన్నికల్లో ఎలాంటి డబ్బు పంపిణీ, ప్రలోభాలకు పాల్పడకుండా ప్రజల మధ్యకు వెళ్లి సుమారు 600 ఓట్లు సాధించామని తెలిపారు. ఆ ఓట్లు తమపై ప్రజలు ఉంచిన నమ్మకానికి ప్రతీకగా భావిస్తున్నామని పేర్కొన్నారు."డబ్బుతో వచ్చిన ఓటు ఒకరోజు ఉంటుంది.. నమ్మకంతో వచ్చిన ఓటు తరతరాలు ఉంటుంది" అని అన్నారు.**మేరుగు రాజుకు తెలంగాణ ఉద్యమ నేపథ్యం** ఈ కార్యక్రమంలో పాల్గొన్న మేరుగు రాజుకు తెలంగాణ ఉద్యమం, విద్యార్థి ఉద్యమం, ప్రజాసంఘాల నేపథ్యం ఉంది. గతంలో ఇండియన్ లెజెండ్స్ యూత్ అధ్యక్షుడిగా పనిచేసిన ఆయన, తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషిస్తూ విప్లవ ఉద్యమ సహచరుడిగా పనిచేశారు.అలాగే ఆదివాసీ హక్కులు, బడుగు బలహీన వర్గాల హక్కులు, సామాజిక న్యాయం కోసం జరిగిన వివిధ ప్రజా ఉద్యమాల్లో భాగస్వామిగా పనిచేసిన అనుభవం తనకు ఉందని మేరుగు రాజు తెలిపారు. ఉద్యమ స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజకీయ వేదిక ద్వారా కూడా తన వంతు కృషి చేస్తానని అన్నారు.**మల్లంపల్లి అభివృద్ధిపై మరో పోరాటం** "మండలం సాధించడం ఒక లక్ష్యం.. మండలం అభివృద్ధి చెందేలా చేయడం మరో లక్ష్యం" అనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని ఉద్యమకారులు తెలిపారు.మల్లంపల్లి మండలానికి అవసరమైన మౌలిక వసతుల సాధన కోసం ప్రజలను కలుపుకొని ముందుకు సాగుతామని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు."మండలం కోసం పోరాడాం.. అభివృద్ధి కోసం మరోసారి పోరాడతాం.. మల్లంపల్లి కోసం మా ప్రయాణం కొనసాగుతుంది" అని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఒన్నాల మహేష్, బత్తిని అజయ్, ముడెడ్ల నవీన్, గోల్కొండ మహేందర్, పల్లెబోయిన అరవింద్, రుత్విక్, ఎం.డి. అఫ్సర్, కూరాకుల వంశీ, కార్తిక్, గుండ కర్ణాకర్, గాజు అజయ్, ఎస్.కె. పాషా పాల్గొన్నారు.వీరితో పాటు శ్రీనగర్ సర్పంచ్ ఆకుల మల్లేష్, మాజీ ఎంపీటీసీ మాచర్ల ప్రభాకర్, మొగ్రి రాజుయాదవ్, నారోజు హరినాథ్, శ్రీనివాస్ రెడ్డి, మహమ్మద్ జాని, మహమ్మద్ చోటు, మహమ్మద్ పాషా, బక్కి శ్రీను, నాయకుల ప్రభాకర్, తూర్పాటి మధు, సుధాకర్ రెడ్డి, రాయల్ రవి, సతీష్, సంపత్, గోవింద నాయక్, గోపాలరెడ్డి, వినయ్ కుమార్, ఏటూరునాగారం సర్పంచ్ శ్రీలత, జంగాలపల్లి సర్పంచ్ మోహన్, భూక్యా మురళి, బుల్లెట్ ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తిగా కొత్తపల్లి గ్రామపంచాయతీ భవనం.. మహిళా సంఘ భవనం...

**పూర్తయ్యేది ఎన్నడు.. ప్రజలకు సేవలు అందించడం ఎప్పుడో..?**

**గ్రామ కమ్యూనిటీ హాల్లో తాత్కాలిక సేవలు....**

**ఐదు సంవత్సరాలైనా పూర్తికాని భవనాలు....**

**పట్టించుకునే వారే కరువయ్యారు....**

**గ్రామ ప్రజల కలలు కలగానే మిగిలేనా..?**





**కమలాపూర్ సెప్టెంబర్ 20 (పి సీడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ భవనం మహిళా గ్రామ ఐక్య సంఘ భవనం ఐదు సంవత్సరాల క్రితం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. స్లాబ్ వరకు పని జరిగి మధ్యలోనే ఆగిపోయాయి. తాత్కాలిక కమ్యూనిటీ హాల్లో గ్రామ పంచాయతీ సేవలు కొనసాగుతున్నాయి. ఆగిపోయిన పనులను పట్టించుకునే నాథుడే లేడు. కొత్తపల్లి గ్రామం కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ హుజురాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడితల ప్రణవ్ దృష్టికి తీసుకెళ్లి నిధులు కేటాయించే విధంగా గ్రామ సర్పంచ్ పాలకవర్గం కృషి చేయాలని గ్రామ ప్రజలు చర్చించుకుంటున్నారు. హనుమకొండ జిల్లాలోని కమలాపూర్ మండలంలో ఏకగ్రీవ పంచాయతీగా ఎన్నిక కాబడిన గ్రామం అభివృద్ధికి దూరంగా పలు సమస్యలతో మండలంలోని వెనుకబడిన గ్రామంగా నిలిచింది.ఇప్పటికైనా సమస్యలపై దృష్టి పెట్టి గ్రామ అభివృద్ధి వైపు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని అన్నారు.

# అభివృద్ధి వైపు నేరెళ్ల గ్రామం...

**● గ్రామాన్ని అభివృద్ధి చేయడమే మా కర్తవ్యం...: సర్పంచ్ జెట్టి నాగలక్ష్మి సురేష్.....**



**కమలాపూర్ సెప్టెంబర్ 20 (పిసీడబ్ల్యు న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల పరిధిలోని నేరెళ్ల గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యాయని గ్రామ సర్పంచ్ జెట్టి నాగలక్ష్మి సురేష్ తెలిపారు. గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణపు పనులను ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నేరెళ్ల గ్రామాన్ని ఆదర్శవంతమైన గ్రామంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జెట్టి నాగలక్ష్మి సురేష్ ఉప సర్పంచ్ బండి తిరుపతి గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా గౌలిగూడ సెంట్రల్ గురుద్వారా శతాబ్ది వేడుకలు

**ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో**

**వైభవంగా 'విశాల్ దీవాన్'**

**హాజరైన వేలాది మంది భక్తులు..**

**అలరించిన గుర్బాణీ కీర్తనలు**

**ఆకట్టుకున్న 'గురు-కా-లంగర్'**

**సమష్టి భోజనాలు**





**హైదరాబాద్, సెప్టెంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్):**సేవ, విశ్వాసం, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన గౌలిగూడ సెంట్రల్ గురుద్వారా సాహిబ్ శతాబ్ది (100 ఏళ్ల) వేడుకలు ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అట్టహాసంగా జరిగాయి. తెలంగాణతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది సిక్కులు, ఇతర వర్గాల ప్రజలు తరలివచ్చి గురు గ్రంథ్ సాహిబ్ జీకి ప్రత్యేక ప్రార్థనలు సమర్పించారు.1926లో ఏర్పాటై, నగర చారిత్రక పరిణామాలకు సాక్షిగా నిలిచిన ఈ గురుద్వారా శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రబంధక కమిటీ ఆధ్వర్యంలో 'విశాల్ దీవాన్' ఆధ్యాత్మిక సభను నిర్వహించారు. తఖ్త్ సచ్‌ఖండ్ శ్రీ హజూర్ అబ్చల్‌నగర్ సాహిబ్ జథేదార్ సింగ్ సాహిబ్ సంత్ బాబా కుల్వంత్ సింగ్ జీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాందేడ్‌కు చెందిన సంత్ బాబా బల్విందర్ సింగ్ జీ, ఢిల్లీ సిక్కు గురుద్వారా మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు హర్మీత్ సింగ్ కల్కా తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ రాగీ జథాలు ఆలపించిన గుర్బాణీ, శబద్ కీర్తనలు భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. శాంతి, సమానత్వం, నిస్వార్థ మానవ సేవే నిజమైన దైవత్వమని పేర్కొన్నారు.గురుద్వారా ప్రబంధక కమిటీ అధ్యక్షుడు ఎస్. త్రిలోక్ సింగ్ మాట్లాడుతూ.. ఈ శతాబ్ది ఉత్సవాలు సర్వమత ఐక్యతకు అద్దం పట్టాయని, భవిష్యత్తులోనూ యువతలో సేవాభావాన్ని, మానవీయ విలువలను పెంపొందించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. **సమభావం చాటిన 'గురు-కా-లంగర్':** వేడుకల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సాంప్రదాయ 'గురు-కా-లంగర్' (సామూహిక ఉచిత అన్నదానం) ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కులమతాల భేదం లేకుండా వేలాది మంది ప్రజలు ఒకే పంక్తిలో కూర్చుని భోజనం చేయడం ద్వారా మానవులంతా ఒక్కటేనన్న సిక్కు తత్వాన్ని, సమానత్వ భావాన్ని చాటిచెప్పారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన ఉపసర్పంచ్ పుల్ల శ్రీనివాస్...



**కమలాపూర్ సెప్టెంబర్ 20(పిసీడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో ఇటీవలె మృతి చెందిన కోలుగూరి సురేష్ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. వారి కుటుంబానికి అండగా ఉంటూ 5000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ పుల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబాలకు సహాయ సహకారాలు అందించడం తమ బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జన్ను స్వప్న బిక్షపతి పుల్ల శ్రీనివాస్ తెలంగాణ రాష్ట్ర రాజ్యాధికార ఐక్య సమితి ప్రధాన కార్యదర్శి శనిగరపు పవన్ ఉపాధ్యక్షులు పుల్ల సునీల్ రాజ్ గ్రామ పెద్దలు పుల్ల కొమురయ్య శోభన్ మంగలి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

